క్లుప్తంగా

నీటిని పొదుపుగా వినియోగించాలి



జీఎస్ఎల్ఆర్ ట్యాంకు వద్ద నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కస్తూర్బా బాలికల విద్యాలయం ఎస్ఓ విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం నుంచి విద్యార్థినులతో గ్రామ పురవీధుల గుండా ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగం, నీటిని పొదుపు వాడుకోవడం, నీటి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.

నాగటూరు ఉప సర్పంచ్ ఎన్నిక



సగినేల వుశేనయ్య

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామ ఉప సర్పంచ్‌గా సగినేల వుశేనయ్య ఎన్నికై నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. సోమవారం నాగటూరు గ్రామంలోని సచివాలయంలో ఎన్నికను నిర్వహించగా.. 10 మంది వార్డు సభ్యులకు గాను 9మంది వార్డు సభ్యులు అంగీకారం తెలిపారన్నారు.

తెలంగాణ మరబోటు సీజ్

కొత్తపల్లి: తెలంగాణ– ఆంధ్రా రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై అనుమతులు లేకుండా తిరుగుతున్న ఓ తెలంగాణ మరబోటును సీజ్‌చేసి ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హుస్సేన్ బాషా సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన శంకర్, ముక్కురగుండంకు చెందిన మల్లయ్యలు అవతలి ఒడ్డు నుంచి ఆంధ్రా ఒడ్డుకు మరబోటులో ప్రజారవాణా చేస్తున్నారని తెలిపారు. సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలసి దాడులు చేసి తెలంగాణ నుంచి ఇవతలి గట్టుకు ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు లేకుండా వస్తున్న బోటును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



ఆత్మకూరులో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు : మండలంలో వివిధ గ్రామాల్లో సోమవారం నూతన పింఛన్లను వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి వలంటీర్ల సహకారంతో పంపిణీ చేశారు. పట్టణంలోని 9వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ సుల్తాన్, సయ్యద్ ఇఫ్రా, బాషా, 10వ వార్డులో కౌన్సిలర్ షేకావలి, కొత్తరామాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివరాం నూతన పింఛన్లను అందజేశారు.

9న సామాజిక తనిఖీ బహిరంగ సభ

జూపాడుబంగ్లా: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై ఈనెల 9న ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5న పోతులపాడు, 7న పారుమంచాల, తూడిచెర్ల, తంగడంచ, 8న తాటిపాడు, భాస్కరాపురం, మండ్లెం, తరిగోపుల, బన్నూరు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తారన్నారు.

మహానందీశ్వరుడి పల్లకీసేవ రద్దు

మహానంది: శ్రావణమాసం, మూడవ సోమవారం జరగాల్సిన మహానందీశ్వరుడి పల్లకీసేవ వర్షం కారణంగా రద్దైంది. కాగా, శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు అలంకార పూజ, హారతులు చేపట్టి రాత్రి ఏకాంతసేవ పూజలు చేశారు.

ఓవర్ లోడ్‌తో వెళ్తే జరిమానా

పగిడ్యాల: ఆటో డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఆటోలో తరలిస్తే జరిమానా విధిస్తామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. సోమవారం ముచ్చుమర్రి స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ఆత్మకూరు: దేశంలోని ప్రజలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.450 లు ఉన్న గ్యాస్ ధర రూ.1200 లకు పెరిగిందని, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్ నాయక్, మాబాషా, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బంగారు భూములను బీళ్లుగా మార్చిన బాబు

- సీడ్ హబ్ పేరుతో స్టేట్‌సీడ్ ఫారం భూములు లాక్కున్న టీడీపీ ప్రభుత్వం
- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పనులు చేపట్టని వైనం
- భూముల్లో పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న సీడ్‌హబ్ నిర్మాణం శిలాఫలకం



కలుపు మొక్కల్లో కలిసిపోయిన ప్రదర్శన క్షేత్రం

జూపాడుబంగ్లా: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేస్తున్న తంగడంచ సీడ్‌ఫారంలోని బంగారు పంటలు పండే భూములను బీడుభూములుగా మార్చిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుంది. సీడ్ హబ్ నిర్మిస్తామని చెప్పి.. ఆ దిశగా పనులు చేపట్టకపోవడంతో భూములు నిరుపయోగంగా మారి ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.

నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తిచేస్తామని..

తెంగెడంచలోని భూముల్లో ఏటా స్టేట్‌సీడ్ ఫారం, ఆచార్య ఎన్‌జీ.రంగా విత్తనపరిశోధన, ఉత్పత్తి కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తిచేసి సీడ్‌విలేజ్ ప్రోగ్రాం కింద రాయితీపై రైతులకు అందజేసేవారు. అయితే రాష్ట్రం,దేశంలోని శాస్త్రవేత్తలను కాదని పర్సెంటేజీలకు కక్కుర్తి పడి ఆమెరికాలోని ఆయోవా సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తిచేసి రైతులను భాగస్వాములను చేస్తానని చెప్పి బంగారు పంటలు పండిస్తున్న భూములను లాక్కున్నారు.

2017లో సీడ్‌హబ్ నిర్మాణానికి భూమి పూజ

2017 అక్టోబర్ 9వ తేదీన సీడ్‌హబ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆరుమాసాల్లోగా సీడ్‌హబ్‌నిర్మాణం పూర్తిచేసి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయటంతోపాటు ఇతర దేశాలకు సైతం ఎగుమతిచేస్తామని చెప్పారు. అదే ఏడాది జూన్ మొదటివారంలో రైతులకు విత్తన ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటుచేసి రైతులకు ఆధునిక విత్తన వంగడాలు, వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని నమ్మబలికారు. అయితే రూ.305కోట్లతో సీడ్‌హబ్ నిర్మాణానికి చంద్రబాబు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కేవలం రూ.100కోట్ల నిధులను కేటాయించి చేతులు దులుపుకొన్నారు. కాగా, కేటాయించిన నిధులతో ఒక్కపనిచేపట్టిన దాఖలాల్లేవు.

బీళ్లుగా మారిన బంగారు భూములు

సీడ్‌హబ్ నిర్మాణం కోసం కేటాయించిన 624 ఎకరాల భూముల్లో ఎలాంటి నిర్మాణం పనులు చేపట్టకపోవటంతో సారవంతమైన భూముల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి బీళ్లుగా మారాయి. అంతేకాకుండా 2018లో సీడ్‌హబ్‌కు కేటాయించిన భూముల్లో ఫారం అధికారులు, ఎన్‌జీ.రంగా వ్యవసాయ పరిశోధన అధికారులు విత్తనోత్పత్తి చేయవద్దని ఆదేశించటంతో వారు సీడ్‌హబ్ భూముల్లో విత్తనోత్పత్తి చేయటం నిలిపివేశారు. దీంతో ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ పరిశోధన అధికారులు రిటర్న్‌వెళ్లిపోగా ఫారం భూముల్లో విత్తనోత్పత్తి నిలిచిపోయింది.

ప్రదర్శన క్షేత్రాలకు నిధులు మంజూరు చేయని చంద్రబాబు

624ఎకరాల్లో ఏర్పాటుచేసిన తంగడంచ సీడ్‌హబ్‌లో రైతుల ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయటానికి రూ.10కోట్ల నాబార్డు నిధులు మంజూరుచేస్తున్నట్లు అప్పట్లో సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వాటితో 2018 జూన్ మొదటివారంలోగా పలురకాల విత్తనాల ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు 2.50 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, కొర్ర, వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు,మిరప, ధనియాలు, వాము, పెసళ్లు, ఉలవలు, మినుములు, తదితర 16 రకాల పంటలు వేశారు. అయితే వాటి నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవటంతో డెమోప్లాంట్లు కలుపు మొక్కల్లో కలిసిపోయాయి.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

ఆత్మకూరు: పట్టణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రోగుల పట్ల వైద్య సిబ్బంది జాగ్రత్త వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 13 సచివాలయాల ఏఎన్ఎమ్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇందువలన వ్యాధులను అరికట్టేందుకు వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. పట్టణంలోని వైద్యశాలకు వచ్చే పట్టణ ప్రజలు, వివిధ మండలాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని, గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

విలేజ్ సర్వేయర్‌కు షోకాజ్ నోటీసు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం-2 సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రవంతి అధికారులకు చెప్పకుండా విధులకు గైర్హాజరవ్వడంతో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ షోకాజ్‌నోటీసు జారీ చేశారు. ఈ మేరకు షోకాజ్ నోటీసును సోమవారం పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ద్వారా శ్రవంతికి అందజేశారు.

ఏకగ్రీవంగా జూపాడుబంగ్లా ఉపసర్పంచ్ ఎన్నిక



ఉపసర్పంచ్‌గా ఎన్నికైన మోతె రాజ్యలక్ష్మితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల ప్రత్యేకాధికారి నాగేంద్ర

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా సచివాయం–2లో సోమవారం ఎన్నికల ప్రత్యేకాధికారి నాగేంద్ర, కన్వీనర్, కార్యదర్శి శాంతయ్య, సర్పంచ్ మొట్టిబాలయ్య అధ్వర్యంలో ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఉపసర్పంచ్ ఎన్నికలో సర్పంచ్‌తో కలిపి 9మంది వార్డుమెంబర్లు పాల్గొన్నారు. అందులో ఏకగ్రీవంగా ఎన్నికైన 7వార్డు మెంబరు మోతే రాజ్యలక్ష్మి ఉపసర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. ఆమెకు పోటీగా ఎవ్వరూ నామినేషన్ వేయకపోవటంతో ఎన్నికల ప్రత్యేకాధికారి నాగేంద్ర రాజ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ డిక్లరేషన్ ఫారం అందజేశారు. అనంతరం ఉపసర్పంచ్‌గా రాజ్యలక్ష్మితో ప్రమాణస్వీకారం చేయించారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన రాజ్యలక్ష్మిని వార్డుసభ్యులు శాలువ, పూలమాలతో సత్కరించారు.

నీటి సమస్యను అధిగమించడానికి బోర్లు



పాములపాడు శ్మశాన వాటిక వద్ద బోరు తవ్వకం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: గ్రామాల్లో నీటి సమస్యను అధిగమించడానికే బోర్లు వేస్తున్నట్లు తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి తెలిపారు. సోమవారం మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజారా క్రిష్టారావుపేటలో 2 బోర్లు, మండల కేంద్రంలో హిందూ శ్మశాన వాటిక 1, ఏఎస్ఆర్ కాలనీలో 1, ఎస్సీ కాలనీలో 1 చొప్పున బోర్లు వేశారు. జల జీవన్‌మిషన్ పథకంలో భాగంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారంతో బోర్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో చేతి పంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా రాములమ్మ, , పీఎంసీ షేక్షాఅలీ, గ్రామ పెద్దలు వెంకటేశ్వరరావు, సురేష్, రఫి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారందరికీ ఉచిత బీమా



మాట్లాడుతున్న జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కష్టపడేవారందరికీ ఉచిత బీమా సౌకర్యం ఉంటుందని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రతిపక్షాల కుతంత్రాలు, కుయుక్తులు ఎన్ని పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. రాష్ట్రానికి జగనన్నే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగల నాగేశ్వరరెడ్డి, నాయకులు ఫక్రు బాషా, శివశంకర్ రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తగ్గుముఖం పట్టిన విష జ్వరాలు



ఎర్రమఠంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో విష జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయిన వైద్యాధికారులు సౌజన్య, జబ్బీర్ తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో ప్రబలిన విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు వైద్యులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి శతవిధాలా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక వైద్యశాల ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామంలో, చెంచుగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలోని కాలనీలతో పాటు చెంచుగూడెంలో ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై మాట్లాడి రక్త పరీక్షలు చేశామన్నారు.

కృష్ణా జలాలకు విశేష పూజలు



కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వర ఆలయం

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం సమీపంలోని సప్తనదుల సంగమ ప్రాంతంలో కృష్ణాజలాలకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ నిజశ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. వరుణుడి అనుగ్రహం కోసం విశేష పూజా కార్యక్రమాలు, రుద్ర వరుణ, అరుణ పారాయణం, వరుణ జపం, వరుణ సంకల్ప పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీశైల జలాశయం పూర్తి స్థాయిలో నిండి ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. శ్రీశైల జలాశయం 885 అడుగుల నుంచి 850.80 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ మండపభాగం బయటపడుతోంది. భక్తులు కృష్ణాజలాలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

కొలతల మేరకు పని చేయండి



మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ సురేంద్ర కుమార్

ఆత్మకూరురూరల్: కొలత మేరకు పనులు చేయడం ద్వారా నిర్ణయించిన వేతనాలు పొంద వచ్చునని ఎన్ఆర్ఈజీఎస్ అంబుడ్స్‌మన్ ఆర్ సురేంద్ర కుమార్ అన్నారు. ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ సచివాలయంలో సోమవారం జరిగిన ఉపాధి హామీ వేతన దారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కూలీలు పని సమయంలో ఎదుర్కొనే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన ఆత్మకూరు మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశ మయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.మోహన్ కుమార్, ఏపీఓ నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సాంకేతిక సహాయకులు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌ను దూషించిన ముగ్గురిపై కేసు

మహానంది: మసీదుపురం గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్న జ్యోతిని దూషించిన అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మహానంది పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన లూర్థమ్మ, ఆంథోనమ్మ, మరియమ్మలు ప్రభుత్వ పథకాల విషయంలో వలంటీరును దూషించారన్నారు. వచ్చే పథకాలు ఆగాయంటూ వాదనకు దిగారని, అయితే వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగస్తుడు ఉండటం, వయసు దాటిపోవడం జరిగిందని చెప్పినా వినకుండా దూషించడంతో వలంటీర్ జ్యోతి ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శ్రీశైలంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థానం ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. లడ్డూ ప్రసాదం కౌంటర్లలో , ఆర్జిత సేవా టిక్కెట్ల స్కానింగ్ చేసే సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పథకాలను ప్రజల వద్దకు చేర్చాలి

ఆత్మకూరు: రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చాల్సిన బాధ్యత ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణఅధ్యక్షులు సయ్యద్‌మీర్, జేసీఎస్ కన్వీనర్ సుల్తాన్ సూచించారు. పట్టణంలోని ఐదు, రెండు సచివాలయాల పరిధిలో సోమవారం వై.ఏపీ.నీడ్స్ జగన్ కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి

నందికొట్కూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు. బీఆర్ఆర్ నగర్‌లో గుడిసె వాసులకు పట్టాలు అందజేయాలని కోరారు. నాయకులు ఫక్కీర్‌సాహెబ్, భాస్కరరెడ్డి, బెస్తరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం పెట్రో ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు కే.రామదాస్ డిమాండు చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు వి నాగమోహన్, అవాజ్ కమిటీ జిల్లా నాయకుడు మహమ్మద్ రఫీ, ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, జి బాషా, రహంతుల్లా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

పాములపాడు: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా నాయకులు రామేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, బాలేసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఎన్ స్వాములు, ఎస్ సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌కి అందజేశారు. నాయకులు ఎన్ దాసు, పి ఏసన్న, దేవకుమార్, గోపాల్, చిన్న చిన్నయ్య పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పుల్లయ్య యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. రసూల్, దుబాయ్ బాబు పాల్గొన్నారు.

98.33 శాతం పింఛన్ల పంపిణీ



దరగయ్యకు పింఛన్ మొత్తాన్ని అందిస్తున్న గ్రామవలంటీర్ సురేష్‌బాబు

పాములపాడు: మండలంలో 98.33 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,821 పింఛన్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5,714 పింఛన్లు ఆయా గ్రామాల్లో గ్రామ వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కాగా మిగతా 107 మంది అందుబాటులో లేరని, త్వరలో వారికి అందజేసి వంద శాతం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలో 5,041 పింఛన్లకు గాను 4,957 పంపిణీ చేయగా 84 పెండింగ్‌లో ఉన్నాయి. నందికొట్కూరులో 5,158 పింఛన్లకు గాను 5,069 పంపిణీ చేయగా 89 పంపిణీ చేయాల్సి ఉంది. మిడుతూరు మండలంలో 5,426 పింఛన్‌దారులకు గాను 5,323 పంపిణీ చేయగా, 103 పంపిణీ చేయాల్సి ఉంది. కొత్తపల్లి మండలంలో మొత్తం 4,236కు గాను 4,148 పంపిణీ చేయగా 88 పంపిణీ చేయాల్సి ఉంది. నందికొట్కూరు అర్బన్‌లో 4,895 పింఛన్లు ఉండగా 4,786 పంపిణీ చేయగా 109 మిగిలి ఉన్నాయి. పగిడ్యాల మండలంలో 4,856 పింఛన్లకు గాను 4,737 పంపిణీ పూర్తి కాగా 119 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది.

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీరు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మండల కేంద్రమైన కొత్తపల్లికి చెందిన పసుపుల దరగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన చికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. గ్రామ వలంటీర్ గూడెం సురేష్‌బాబు సోమవారం కర్నూలుకు వెళ్లి చికిత్స పొందుతున్న దరగయ్యకు వృద్ధాప్య పింఛన్ నగదు రూ.2750 లకు ఆయన అందించాడు. కష్టకాలంలో పింఛన్ అందించడంపై వారు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌కు సన్మానం



మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్లను సన్మానించిన దృశ్యం

నందికొట్కూరు: స్థానిక మార్కెట్ యార్డులో మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ నాయుడులను నూతన చైర్‌పర్సన్ షేక్ రహత్, వైస్ చైర్మన్ షరీఫ్, కార్యవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. మాజీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో మార్కెట్ యార్డును అభివృద్ధి చేశామన్నారు. సిద్ధార్థరెడ్డి ప్రభుత్వం నుంచి రూ. 1.08 కోట్ల నిధులను విడుదల చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జలీల్ అహమ్మద్, దావీద్, అబ్దుల్ గఫూర్, శివమల్లమ్మ, రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్ సలాం, జబ్బార్, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందిని వదలని ఎలుగుబంటి



తెలుగుగంగ క్వార్టర్స్‌లోని ఓ పాత ఇంటి వద్ద ఉన్న ఎగులుబంటి

మహానంది: మహానందిలో గత మూడురోజులుగా సంచరిస్తున్న ఎలుగుబంటి సోమవారం తెల్లవారుజామున మళ్లీ టోల్‌గేట్ ఎదురుగా ఉన్న పొలాల్లో కనిపించింది. వేకువన రెండు గంటల సమయంలో టోల్‌గేట్ పరిసరాల నుంచి పెట్రోల్‌బంక్ వెనుక వైపు మార్గం ద్వారా తెలుగుగంగ కట్టవైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మహానందీశ్వరస్వామి దర్శనం వేకువ నుంచే ప్రారంభమవుతుంది. దీంతో ఆలయ సిబ్బంది, అర్చకులు తెల్లవారుజామున 3.30గంటల నుంచే వెళ్లాల్సి ఉంది. అయితే ఎలుగుబంటి సంచారంతో భయంభయంతో విధులకు వెళ్తున్నారు. ఇందిలా ఉండగా ఎలుగు బంటి సంచారంపై పత్రికల్లో, టీవీల్లో నిత్యం వార్తలు రావడంతో అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. డిప్యూటీ రేంజర్ నాగేంద్ర నాయక్, డీఆర్వో హైమావతి, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ప్రొటెక్షన్ వాచర్లు కాలనీల్లో ఎగులు బంటి ఆచూకీ కోసం అన్వేశించగా.. తెలుగు గంగ క్వాటర్స్ వద్ద ఓ పాత ఇంటి వద్ద ఎగులుబంటి కంటబడింది. దానిని పట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎగులుబంటిని బంధించి అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు వారు వెల్లడించారు.

విస్తారంగా వర్షాలు

- ఆత్మకూరులో 63.4 మిమీ వర్షం
- రైతులకు ఊరట



బావాపురం సమీపంలో మొక్కజొన్న చేనులో నిలిచిన వర్షపునీరు



పొలంలో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు: మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం 63.4 మీమీ వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులు ఖరీఫ్ లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, మెట్టవరి పంటలకు కొంత ఊరటనిచ్చాయి. అలాగే బోరు బావుల్లో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంట పొలాల్లో వర్షపు నీరు నిలబడడంతో ఈ నెలలో పంటలు ఏపుగా పెరిగేందుకు ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెబుతున్నారు.

అత్యల్పంగా పగిడ్యాలలో..

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు 12.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని కొత్తపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా పగిడ్యాలలో అత్యల్పంగా 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. జూపాడుబంగ్లాలో 12.4ఎం.ఎం, నందికొట్కూరులో 16.4ఎం.ఎం, పాములపాడులో 9.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

కొత్తపల్లిలో 50.8 మి.మీల వర్షం

కొత్తపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది. 50.8 మి.మీల వర్షపాతం నమోదు అయింది. పలు గ్రామాలలో కాలనీలు జలమయం అయ్యాయి. అదేవిధంగా వర్షపు నీరు పంట పొలాలలో ఏరులై పారుతోంది. వరి, మొక్కజొన్న, పత్తి, కంది పంటలు కళకళలాడుతున్నాయి. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆశ చిగురిస్తోంది. ఖరీఫ్ ఆశలు సజీవంగానే ఉంటాయని కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పొగాకు నాట్లు

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడుమూరు, ఉప్పలదడియ, కలమందలపాడు, మాసపేట, పైపాలం, 49–బన్నూరు, చౌట్కూరు, దేవనూరు తదితర గ్రామాల్లో జోరుగా పొగాకు నాట్లు నాటారు. పొగాకు నాటేందుకు కూలీలకు భలే గిరాకి ఉంది. ఎకరా పొగాకు నాటితే రూ. 2500 నుంచి రూ. 3500 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

పాములపాడు: నెల రోజులకు పైగా వర్షాల్లేక వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు మండుతున్న తరుణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. మండలంలో సోమవారం 9.06మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైంది. కాగా ఉదయం నుంచి చినుకులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పొలాలకు వెళ్లిన వ్యవసాయ కూలీలు మధ్యలోనే ఇంటి బాట పట్టాల్సి వచ్చింది.